# అమృతవర్షిణి

## కుప్పిలి పద్మ

ప్రియమైన మీకు,

బాగున్నావా? అని వ్రాసారు.

"తలపు తలపుకు గుండె కదిలిపోతుంటే
కదలించు ప్రతి తలపు కవిత అవుతుంటే
కవితలే ఎల్లువై పుప్పొంగి పురకంగ
నా గుండెకే గండి పడినాది ఓ ప్రియతమ"

ఇది నా పరిస్థితి.

ఓ స్థితిని దాటిన మనసుకి దుస్థితి వృదనుకుంటాను. నేను నిశ్చయంగా చెప్పగలను చలాన్ని అర్థం చేసుకోవడానికి పట్టిన కాలానికి పదింతలు పడుతుంది. ప్రజలు నన్ను అర్థం చేసుకోడానికి. బహుశా ఒంటరితనన్ని అందుకే ప్రిఫర్ చేస్తాననుకుంటాను. ప్రతి అర్థమైన గాడిదకీ జీవితార్థాలు చెప్పుకుంటూ బ్రతకలేకేమో ఈమధ్య మరీ ఒంటరిగా వుండాలనిపిస్తుంది.

ఏం చేస్తున్నావ్? నేనుమాత్రం బద్ధకంగా హాయిగా బతికేస్తున్నా. ఏదైనా పెద్దపనంటూ వుంటే నీకు వుత్తరాలు రాయటమే.

ఇక్కడికి రాకూడదూ, ఏమైనా రాద్దాం. నాతో పని చేయించగలిగేది నువ్వే- ఇంకెవ్వరూ చేయించలేరు. నువ్వు బాగా రాస్తావ్. నీ రచనలు చదువుతుంటే చిన్నప్పుడు మా తాతయ్య కథలు చెప్పటం గుర్తొస్తుంది. చాలా ఆసక్తిగా చదివిస్తావ్. అలా అంటే "నా రచనలు చందమామ కథల్లా వుంటాయా" అంటూ నవ్వుతావ్. కాని అసలా కథల్ని నేనెంత ఆసక్తిగా చదివేదాన్నో చెపితే అసూయ పడతావ్.

మబ్బుగా వుంది బయట- అద్దాల తలుపు లోంచి వాతావరణం మత్తుగా కనిపిస్తోంది. వాతావరణం అలా వుంటే నాకు అస్సలు ఊపిరాడదు. మనసులో బెంగ పేరుకుపోతుంది. వూరికే కారణం లేకుండా తల్లడిల్లిపోవడం చిత్రంగా వుంటుంది. ఇటువంటప్పుడు నువ్వు పక్కనుంటే "నీకో కప్పు టీ ఇవ్వనా" అని అడుగుతాను.

నువ్వేమో "నీ చేతి టీ కంటే కాఫీయే బాగుంటుంది కాని నాకిప్పుడు టీ తాగాలని వుంది. అసలే పాలు తక్కువ వున్నాయ్ నే చెయ్యనా" అంటావు.

"నీకు టీ చెయ్యటం రాదు" అని నీయంతందంగా ఎవ్వరూ చెప్పలేరు. నిజానికి నీతో అలా చెప్పించుకోవాలనే నే అన్నిసార్లు "టీ కావాలా" అని అడిగేది.

టీ కప్పులో మేఘాలు, మనసులో తుపానుని రేపుతున్నాయి. మొట్టమొదటిసారి నువ్వు టీ తాగుతావా అని అడిగినరోజు నా ఆనందం ఎలా వివరించను. ఓ కప్పుతో అమృతం ఇచ్చిన అనుభూతి. అమృతం అమృతం అంటారు కదా- దాని రుచి ఎవరికైనా తెలుసా? బహుశా మనకి అత్యంత ఆప్తులైన వాని మాటల్లో, చూపుల్లో, ఆతిధ్యంలో మధురిమనే అమృతంగా భావిస్తాం అనుకుంటాను.

నువ్వోసారి నే చేసిచ్చిన టీని బాగుందని మెచ్చుకుంటే బోల్డంత సంతోషమేసింది. చాలా మందికి ఆతిధ్యం ఇవ్వటం రాదు. తీసుకోవటం రాదు. నీ ఇంటికి వచ్చినవాళ్ళని నువ్వెంతో ఆప్యాయంగా ఆహ్వానిస్తావు. వాళ్ళు నీకెంతో ఆత్మీయులైనట్టు. వారి రాక నీకెంతో ఆనందం కలిగించినట్టు- అభిమానంగా మాట్లాడతావు. నీ గురించి, నీ రచనల విశిష్టత గురించి, నీ మనసెటువంటిదో నువ్వే గొప్పగా వాళ్ళకి చెప్పవు. మరో వ్యక్తి గురించి చులకనగా మాట్లాడవు. పాటి రచయిత గురించి అసూయగా మాట్లాడవు. అందరూ చెప్పేవి వింటావు. ఎవరి దగ్గరా ఎవ్వరి గురించీ మాట్లాడవు. అందుకే నే అంటాను నీకో విషయం చెప్పినా- నీ పెదవి దాటి మరో వ్యక్తి చెవికి సోకదని. అందరికీ సహాయం చేస్తావ్. నీలా ప్రతి వ్యక్తివుంటే, వుండగలిగితే ఆనందం ఆ వ్యక్తిని విడిచిపోదు. ఓ వ్యక్తి గురించి పాజిటివ్ థింకింగ్ ఇచ్చినంత ఆరోగ్యం, సంతోషం, శాంతి నెగిటివ్ థింకింగ్ ఇవ్వదు. ఈ నిజాన్ని ఈ అమాయక ప్రజలు ఎప్పుడు గ్రహిస్తారో?

మబ్బుల్ని చీల్చుకుంటూ జల్లు కురుస్తుంది. కురిసే ఆ నీరు ఓ పిల్లకాలువై నా ముంగిటి నుండి ప్రవహిస్తే అనురాగాల నావనెక్కి ఆ పరమ్మున పయనించి నీ ముంగిట నిలవాలని వుంది. నాకు నీ దగ్గరకి రావాలని వుంటే ఆ జల్లుల మరింత వేగంగా, ఇంకాస్త ఒత్తుగా కురిపించమని మేఘాలని ఆజ్ఞాపించు. నీ ఆజ్ఞని తిరస్కరించే ధైర్యం ఎవరికుంది చెప్పు. నాకు తప్ప.

నా ముంగిట నరస్సు కోసం ఎదురు చూస్తు.

నేను.

